# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-09-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారత 15వ ఉపరాష్ట్రపతిగా సి పి రాధాకృష్ణన్ ఎన్నికైయ్యారు.**
2. **ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురంలో జరిగే 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పాల్గొంటారు.**
3. **తెలంగాణలో ప్రాంతీయ బాహ్య వలయ రహదారి పనుల ప్రారంభానికి అనుమతులు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.**
4. **క్యాన్సర్ నివారణకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.**
5. **నేపాల్ దేశంలో ఉద్రిక్తతల నేపథ్యంలో అక్కడ చిక్కుకుపోయిన తెలుగు వారి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.**

=========================

భారత 15వ ఉపరాష్ట్రపతిగా సి పి రాధాకృష్ణన్ ఎన్నికయ్యారు. నిన్న జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికకు 377 ఓట్లు అవసరం కాగా.. రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు, సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు లభించాయి. 781 మందికి గాను 767 మంది పార్లమెంట్ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకోగా 14 మంది ఎన్నికలో పాల్గొనలేదు. పోలైన మొత్తం ఓట్లలో 15 చెల్లనివిగా గుర్తించారు. దీంతో 152 ఓట్ల మెజార్టీతో రాధాకృష్ణన్ గెలుపొందినట్టు రాజ్యసభ సెక్రటరీ ప్రకటించారు. అనంతరం రాధాకృష్ణన్ మాట్లాడుతూ

వాయిస్ 19 సెకన్లు

ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సిపి రాధాకృష్ణన్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో జరిగే 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రులు, బిజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఇతర కూటమి పార్టీల ముఖ్య

నాయకులు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను హోంశాఖ మంత్రి అనిత నిన్న పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,

వాయిస్ ..27 సెకన్లు

------------------------

తెలంగాణలో ప్రాంతీయ బాహ్య వలయ రహదారి –ఆర్ఆర్ఆర్ కు 90 శాతం భూ సేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి అనుమతులు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నిన్న కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు. రావిర్యాల–ఆమన్గల్–మన్ననూర్ రహదారిని నాలుగు వరుసల గ్రీన్ఫీల్డ్ హైవేగా నిర్మించాలని, హైదరాబాద్–మంచిర్యాల మధ్య నూతన గ్రీన్ఫీల్డ్ రహదారిని జాతీయ రహదారిగా మంజూరు చేయాలని రేవంత్ రెడ్డి కోరారు.

------------------------

సుస్థిర ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి–జీఎస్డీపీపై రాష్ట్ర ప్రణాళిక శాఖ 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను రూపొందించిన మొదటి త్రైమాసిక వృద్ధి అంచనాలను నిన్న పరిశీలించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఈ ఆర్థిక సంవత్సరంలో 17.1 శాతం వృద్ధి సాధించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. అన్ని రంగాల వృద్ధికి ప్రత్యేక అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

------------------------

నేపాల్ దేశంలో ఉద్రిక్తతల నేపథ్యంలో పర్యటనకు వెళ్లి ప్రస్తుతం అక్కడ చిక్కుకుపోయిన తెలుగు ప్రజలకు తక్షణ సాయం అందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఢిల్లీలోని ఏపీ భవన్లో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నవారు 98183 95787 నంబర్ను సంప్రదించవచ్చని ఒక ప్రకటనలో పేర్కొంది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్నాయుడు అక్కడి తాజా పరిస్థితులపై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రితో నిరంతరం సంప్రదిస్తున్నట్లు తెలిపింది. అక్కడ ఉన్న తెలుగువారికి నేపాల్లోని భారత రాయబార కార్యాలయం ద్వారా సాయం అందించాలని విన్నవించినట్లు పేర్కొంది. ప్రస్తుతం ఖాట్మండులోని బఫాల్ ప్రాంతంలో 30 మంది తెలుగు ప్రజలు రాయబార కార్యాలయం ద్వారా సాయం పొందుతున్నట్లు వెల్లడించింది.

------------------------

క్యాన్సర్ నివారణకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాల నుంచి రాష్ట్రంలోని 34 బోధనాసుపత్రుల్లో క్యాన్సర్ డే కేర్ సెంటర్లను ఆయన నిన్న దృశ్య మాధ్యమ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి డే కేర్ సెంటర్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. అలాగే 34 మొబైల్ స్క్రీనింగ్ వాహనాలను ఏర్పాటు చేసి, గ్రామాల్లో ప్రతి కుటుంబానికి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

------------------------

వస్తు సేవల పన్ను – జీఎస్టీ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు వినియోగదారుడి కొనుగోలు శక్తిని పెంచడంతో పాటు, వ్యాపారస్తులకు ప్రయోజనకరంగా ఉంటాయని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై తూర్పుగోదావరి జిల్లా చెందిన వ్యాపారి మాట్లాడుతూ...

వాయిస్ ..32 సెకన్లు

---------------------------

ఆత్మహత్యల నివారణ పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ రోజు ప్రపంచ ఆత్మహత్యల నివారణా దినం పాటిస్తున్నారు. ఆత్మహత్యల నివారణ కోసం కృషి చేసే అంతర్జాతీయ సంస్థ –ఐఎఎస్‌పి, ప్రపంచ ఆరోగ్య సంస్థ –డబ్ల్యుహెచ్ఓల సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఏటా సెప్టెంబర్ 10వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. ఏదైనా సమస్య ఎదురైతే ఆ సమస్యను పరిష్కరించుకునే మానసిక బలం లేక ప్రపంచ వ్యాప్తంగా పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రతి సమస్యకూ మరణమే పరిష్కారం కాదని, ఆత్మహత్యకు ప్రేరేపించిన పరిస్థితుల కంటే, ఆ పరిస్థితులను అధిగమిస్తే వచ్చే బంగారు జీవితం గురించి ఆలోచించాలన్న అంశంపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

ఆత్మహత్యలు వంటి దుర్ఘటనలకు పాల్పడకుండా చిన్నప్పటి నుండే ఇళ్లలో తల్లి దండ్రులు, పాఠశాలలలో ఉపాధ్యాయులు పిల్లలలో తగిన మానసిక బలం, ఆత్మ విశ్వాసం కల్పించాలని, అప్పుడే ఆత్మహత్యల నివారణ సాధ్యమవుతుందని మానసిక వైద్యులు సూచిస్తున్నారు.

---------------------------

వాయవ్య బంగాళాఖాతం దానిని ఆనుకొని దక్షిణ ఒడిషా, ఉత్తర కోసాంధ్రాల మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని విశాఖపట్నంలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి జగన్నాథ కుమార్ తెలియజేస్తూ...

వాయిస్..19 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ ఉపరితల ఆవర్తన ప్రభావంతో పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

గ్రూప్ –1 పరీక్ష విషయంలో తెలంగాణ హైకోర్టు తీర్పుపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. హైదరాబాద్ లోని గాంధీభవన్ లో ప్రజలు, కార్యకర్తలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, గ్రూప్–1 పరీక్షల పేపర్ మూల్యాంకానం తిరిగి చేయాలా? లేదా?, పరీక్ష నిర్వహించాలా? లేదా? అన్న విషయంపై ప్రభుత్వం చర్చించి నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

---------------------------

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. నిడదవోలు క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో నియోజకవర్గ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను మంత్రి నిన్న వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిడదవోలులో 300 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. నిడదవోలు పట్టణంలో 10 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. స్థానికంగా ఉన్న 30 పడకల ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దుతామని, ఇప్పటికే ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయని మంత్రి వివరించారు.

======================